క్లుప్తంగా

బీమా చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న అధికారులు

హన్మకొండ అర్బన్: ఇటీవల ధర్మసాగర్ మండలం కరుణాపురం గ్రామానికి చెందిన పసునూరి పూర్ణచందర్ అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో ప్రమాదవశాత్తు మరణించాడు. ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్‌లో ప్రమాద బీమా ఉండగా, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంకు చీఫ్ మేనేజర్ గూడూరు విజేందర్, జోనల్ మేనేజర్ శంకర్ లిక్కి, నర్సింగరావు, కస్టమర్ ఆఫీసర్ కుమారస్వామి శుక్రవారం మృతుడి భార్య పసునూరి అనూషకు రూ.10 లక్షల ప్రమాద బీమా చెక్కును అందించారు.

మోదీతోనే దేశాభివృద్ధి

ఆత్మకూరు: ప్రధానమంత్రి నరేంద్రమోదీతోనే దేశం అభివృద్ధి చెందుతుందని బీజేపీ మండల అధ్యక్షుడు సదానందం శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రాల అభివృద్ధికి సైతం అధిక నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. తెలంగాణలో కొనసాగుతున్న కుటుంబ పాలనకు ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో కేంద్రంతో పాటు రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. నాయకులు ఉప్పుగల్ల శ్రీకాంత్‌రెడ్డి, పైడి, తదితరులు ఉన్నారు.

'చల్లా' కృషితోనే అభివృద్ధి పరుగులు

ఆత్మకూరు: పరకాల నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు వేముల నవీన్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ పాలనలో ప్రతీ గ్రామం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఉద్యమకారులకు ఎమ్మెల్యే అండగా ఉంటున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో చల్లా ధర్మారెడ్డి గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మరోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు అంబటి రాజస్వామి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాపన్న విగ్రహం ఏర్పాటు చేయాలి



కార్మికులతో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

పరకాల: పట్టణంలోని పెద్దమ్మతల్లి ఆలయ సమీపంలో సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని గౌడ సంఘం నాయకులు ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిను కోరారు. శుక్రవారం పట్టణంలో ఎమ్మెల్యే పర్యటించగా కల్లు గీత కార్మికులు కలిసి సర్వాయి పాపన్న విగ్రహం ఏర్పాటు చేయాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. విగ్రహ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని అధికారులకు సూచించారు.

దళితుల పక్షపాతి 'గండ్ర'



స్లాబ్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న నాయకులు

శాయంపేట : ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, జెడ్పీచైర్పర్సన్ గండ్ర జ్యోతిలు దళితుల పక్షపాతి అని పీఏసీఎస్ చైర్మన్ కుసుమ శరత్, ఉపసర్పంచ్ దైనంపల్లి సుమన్‌లు అన్నారు. మండల కేంద్రంలోని దళిత కాలనీలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.25లక్షల నిధులు మంజూరు చేయగా శుక్రవారం హాల్ స్లాబ్ నిర్మాణ పనులను వారు ప్రారంభించి మాట్లాడారు. గండ్ర దంపతుల హయాంలోనే అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల ఏఎంసీ వైస్‌చైర్మన్ మారపల్లి నందం, మాజీ ఎంపీటీసీ వినుకొండ, శంకరచారి, నాయకులు మారపల్లి మోహన్, పాపయ్య, రాజయ్య, చిరంజీవి, ప్రభాకర్, కరణ్‌బాబు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరా బంద్

వరంగల్ అర్బన్: వరంగల్ అండర్ రైల్వే జోన్ పరిధిలో శనివారం నీటి సరఫరా ఉండదని బల్దియా ఈఈ బీఎల్.శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ధర్మసాగర్ రిజర్వాయర్ వద్ద 60 ఎంఎల్‌డీ నీటి శుద్ధీకరణ కేంద్రంలో అంతర్గత నిర్వహణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈక్రమంలో నగరంలోని పలు ప్రాంతాలు పెరుకవాడ, శివనగర్, పుప్పాలగుట్ట, కరీమాబాద్, రంగసాయిపేట, ఉర్సు, శంభునిపేట, ఖిలా వరంగల్, చింతల్, తిమ్మాపూర్, మామునూరు, సింగారం, బొల్లికుంట, భట్టుపల్లి, కడిపికొండ, రాంపేట, రాంపూర్, మడికొండ ప్రాంతాల్లో ఒకరోజు నీటి సరఫరా ఉండదని తెలిపారు.

గ్రూప్–4 పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు



దామెర: పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏసీపీ శివరామయ్య



ఐనవోలు: పరీక్ష కేంద్రం వద్ద నిర్వాహకులతో మాట్లాడుతున్న ఏసీపీ కృపాకర్

దామెర : తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నేడు(శనివారం) జరిగే గ్రూప్4 పరీక్ష నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు పరకాల ఏసీపీ జూపల్లి శివరామయ్య తెలిపారు. మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలో గల డిస్నీల్యాండ్ పాఠశాల, కేర్ ఫార్మసీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడారు. ఉదయం 10 గంటల నుంచి 12.30 వరకు మొదటి పేపర్, మధ్యాహ్నం 2.30 గంటల నుండి 5 గంటల వరకు రెండో పేపర్ పరీక్ష ఉంటుందన్నారు. అభ్యర్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ప్రతీ ఒక్కరిని క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామని పేర్కొన్నారు. పరీక్ష రాసే సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆయన వెంట ఎస్సై ముత్యం రాజేందర్, చీఫ్ సూపరింటెండెంట్ రాకేష్ భాను, దినేష్ చందర్ తదితరులు ఉన్నారు.

శాయంపేట : నేడు(శనివారం) నిర్వహిస్తున్న గ్రూప్స్ –4 పరీక్ష కేంద్రాన్ని స్థానిక ఎస్సై వీరభద్రరావు శుక్రవారం పరిశీలించారు. మండల కేంద్రంలోని నవోదయ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయగా పరీక్ష గదులు, మౌలిక వసతులను పోలీస్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 10గంటల నుంచి 12.30 వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. 9.45 గంటలకు పరీక్ష కేంద్రం గేటు మూసివేస్తామని, పరీక్షలు రాసే అభ్యర్థులు గంట ముందు చేరుకోవాలని సూచించారు. ఆలస్యంగా వస్తే అనుమతించమని పేర్కొన్నారు. పరీక్ష రాసే 120 మంది అభ్యర్థులకు ఉచిత మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించనున్నట్లు వెల్లడించారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. ఆయన వెంట లైజన్ ఆఫీసర్ శైలశ్రీ,, రూట్ ఆఫీసర్ రాజమౌళి, పాఠశాల ప్రిన్సిపాల్ పృథ్వీ, పాఠశాల ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

ఐనవోలు: నేడు జరగనున్న గ్రూప్ 4 పరీక్ష కేంద్రాలను మామునూరు ఏసీపీ కృపాకర్ శుక్రవారం పరిశీలించారు. మండల కేంద్రంలోని పాత్‌ఫైండర్, పున్నేలు క్రాస్ సమీపంలోని ఏకశిలా ఈ టెక్నో స్కూల్, పంథిని ప్రభుత్వ పాఠశాల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా పోలీసు బృందం పరిశీలించింది. సీటింగ్ సదుపాయం, తాగునీటి తదితర ఏర్పాట్లను ఆయా కేంద్రాలకు నియమించిన లైజనింగ్ ఆఫీసర్‌లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే పరీక్షకు 8 గంటల నుంచి గేట్లు ఓపెన్ చేసి 9.45 గంటలకు గేట్లు మూసివేస్తామని అన్నారు. అదే విధంగా మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రారంభమయ్యే పరీక్షకు 1 గంటలకు గేట్లు ఓపెన్ చేసి 2.15 గంటలకు మూసివేస్తామన్నారు. సమయం దాటిన తర్వాత పరీక్ష కేంద్రంలోకి ఎవరిని అనుమతించబోమన్నారు. మూడు కేంద్రాల్లో 860 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్ష రాసే అభ్యర్థులు ఐడీ కార్డు, హాల్ టికెట్ తీసుకొచ్చుకోవాలని, లేని పక్షంలో హాల్‌లోకి అనుమతించమని అన్నారు. పరీక్ష కేంద్రంలోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదన్నారు. అభ్యర్థులు బూట్లు(షూ) ధరించకూడదన్నారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పర్వతగిరి ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, ఎస్సై గుగులోతు వెంకన్న, లైజనింగ్ ఆఫీసర్లు, హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.



శాయంపేట: ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్సై

కమలాపూర్: శనివారం జరిగే గ్రూప్–4 పరీక్ష నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాటు చేశారు. మండలంలోని ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలలో 360 మంది, తెలంగాణ మోడల్ స్కూల్‌లో 288 మంది, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 192 మంది, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 144 మంది చొప్పున మొత్తం 984 మంది పరీక్షకు హాజరు కానున్నట్లు ఆయా పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు వెల్లడించారు. 9.45గంటలకు గేట్లు మూసివేస్తామని, అభ్యర్థులు గంట ముందు కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. అలస్యమైతే పరీక్ష కేంద్రంలోకి అనుమతి ఉండదని, అభ్యర్థులు గమనించాలని కోరారు.

సమస్యలపై పాలకులను నిలదీయండి



కేశవాపూర్‌లో మాట్లాడుతున్న ప్రవీణ్‌రెడ్డి

ఎల్కతుర్తి: గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై బీఆర్‌ఎస్ పార్టీ పాలకులను నిలదీయాలని మాజీ ఎమ్మెల్యే అల్లిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని కేశవాపూర్, గొల్లపల్లి గ్రామాల్లో పల్లెపల్లెకు ప్రవీణన్న, గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన పర్యటించారు. రోడ్లు అధ్వానంగా మారాయని వాటిని పట్టించుకునే నాథుడే కరువయ్యారని పలువురు మహిళలు ప్రవీణ్‌రెడ్డికి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో దళారీలు ఎక్కువయ్యారని, పాలకులను కలువాలన్న, ప్రజల సమస్యలు విన్నవించాలన్నా దళారులను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను పక్కన బెట్టి తెలంగాణ దశాబ్దాల పేరిట సంబరాలు నిర్వహించి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కేసీఆర్ మాయమాటలు నమ్మి మోసపోవద్దని రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించి ఆశీర్వదించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కర్ణాటక ప్రభుత్వం అమలు చేస్తున్న తరహాలోనే రూ. 500లకే గ్యాస్ సిలిండర్, 2లక్షల వరకు రుణమాఫీ, సొంతింటి స్థలంలో గృహ నిర్మాణం కోసం రూ. 5లక్షల సాయం, ఇంట్లో ఇద్దరు వృద్దులుంటే రూ. 5వేల పింఛన్ వంటి పథకాలకు శ్రీకారం చుడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సుకినె సంతాజీ, టీపీసీసీ సభ్యుడు బొమ్మనపల్లి అశోక్‌రెడ్డి, నాయకులు ఇంద్రసేనారెడ్డి, దాట్ల రాముడు, ముప్పు మహేందర్, ఈర రమేష్, శ్రీనివాస్, గణేష్, నాగేంద్ర, సంపత్, తిరుపతి, సుమన్‌గౌడ్, ప్రవీణ్, రాజయ్య, ప్రభాకర్, బుచ్చిరెడ్డి, అశోక్, భాస్కర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి

కమలాపూర్: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన బాధిత కుటుంబాలను ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. మండలంలోని మర్రిపల్లిగూడెం, మాదన్నపేట, నేరెళ్ల, కానిపర్తి, పంగిడిపల్లి గ్రామాల్లో మృతిచెందిన కుటుంబాలను ఓదార్చి మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. మృతికి గల కారణాలను అడిగితెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు పార్టీ పరంగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పేరాల సంపత్‌రావు, మాజీ జెడ్పీటీసీ నవీన్‌కుమార్, మాజీ ఎంపీపీ లాండిగె లక్ష్మణ్‌రావు, నాయకులు ఇనుగాల విజయ్‌కుమార్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వెంకట్‌రెడ్డి జన్మదినం

ఎల్కతుర్తి: సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి జన్మదినాన్ని పార్టీ నాయకులు మండల కేంద్రంలో శుక్రవారం జరుపుకున్నారు.

మహిళను చేరదీసిన హెడ్‌కానిస్టేబుల్

- కుటుంబ సభ్యులకు అప్పగింత



మహిళను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

ధర్మసాగర్: మండల కేంద్రంలోని రహదారిపై బుధవారం అర్ధరాత్రి మతిస్థిమితం లేని ఓ మహిళను అక్కడే విధులు నిర్వహిస్తున్న పోలీస్‌హెడ్ కానిస్టేబల్ దసిర్యా చేరదీశారు. మహిళకు భోజనం, బట్టలు ఇతర సౌకర్యాలు కల్పించి వివరాలు అడుగగా ఆమె తన పేరు నిషా పాండే, ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అని చెప్పిందన్నారు. దీంతో హెడ్‌కానిస్టేబుల్ సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి ఉత్తరప్రదేశ్ రాష్ట్ర పోలీసులతో మాట్లాడి పూర్తి వివరాలు సేకరించి ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అయితే నిషాపాండే తన భర్త సంజయ్ పాండే, ఇద్దరు పిల్లలతో కలిసి 10 సంవత్సరాల నుంచి హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారని, గత రెండు నెలల నుంచి నిషా పాండే ఇంట్లో కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు వెతుకుతున్నట్లు నిషాపాండే భర్త తెలిపారు. హైదరాబాద్‌లోని జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో ఉమెన్ మిస్సింగ్ కేసు కూడా నమోదు అయిందన్నారు. గురువారం రాత్రి ధర్మసాగర్ పోలీస్ స్టేషన్‌కు చేరుకొన్న కుటుంబ సభ్యులు నిషాపాండేను చూసి భాగోద్వేదానికి లోనైయ్యారు. ధర్మసాగర్ సిఐ ఒంటేరు రమేష్, ఎస్‌ఐ సాయిబాబుల సమక్షంలో మహిళను కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు చేధనలో చురుకైన పాత్ర వహించిన హెడ్ కానిస్టేబుల్ దసిర్యాను సిఐ, ఎస్‌ఐలు అభినందించారు.

చదవడం అలవర్చుకోవాలి



పుస్తక పఠనం చేపిస్తున్న రామారావు

ఎల్కతుర్తి: ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతీ విద్యార్థికి స్పష్టంగా చదవడం రావాలని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు బూర్గుల రామారావు అన్నారు. మండలంలోని ఆరేపల్లిలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయులు చేపట్టిన పఠనోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రతీ విద్యార్థి పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని సూచించారు. పుస్తకాలు స్పష్టంగా చదవగలిగినప్పుడే మంచి ర్యాంకులు సాధించవచ్చన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పింగళి హేమలత, ఉపాధ్యాయురాలు చంద్రకళ, సీఆర్పీ రవికుమార్, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరల పెంపుపై కాంగ్రెస్ నిరసన

వరంగల్ చౌరస్తా: నిత్యావసరాల ధరలు పెరగకుండా కట్టడి చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయంటూ సిటీ మహిళా కాంగ్రెస్ పార్టీ నాయకులు విమర్శించారు. ఈమేరకు వరంగల్ హెడ్‌పోస్టాఫీస్ వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధరల పెరుగుదలతో పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సిటీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నారగోని స్వప్న నేతృత్వంలో జరిగిన నిరసన కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు రేణిగుంట్ల శివ, కాంగ్రెస్ నాయకులు కూచన రవీందర్, సందెల లాజర్, కురుమిళ్ల సంపత్, ఎండీ.సాజిద్, బండి సుధాకర్, ఎర్రం కమల్, పోలెపాక విశాల్ బాబు, పుష్ప, అయిత అరుణ్, పుష్పలత, లక్ష్మి, రజిత తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న అడిషనల్ డీఆర్‌డీఓ పీడీ రవి

నడికూడ: విధుల్లో అలసత్వం వహిస్తే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని డీఆర్‌డీఓ పీడీ రవి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రెండో విడత సామజిక తనిఖీ, ప్రజా వేదిక సమావేశం శుక్రవారం జరిగింది. మండలంలో జరిగిన ఉపాధి హామీ పథకం పనుల పై సామాజిక తనిఖీ నిర్వహించి సమగ్ర సమాచారంపై మండల ఇన్ హౌస్ వేదిక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రూ 18,700 లను సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధీ హామి అధికారుల నుంచి రికవరీ చేయనున్నట్లు వెల్లడించారు. మహిళా సంఘాలు, ప్రజాప్రతినిధులతో సమన్వయంతో పని చేయాలని, రికార్డుల్లో తప్పులు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. వివరాల సేకరణలో నిర్లక్ష్యం వహించి తప్పులు చేసిన వారికి జరిమానా విధించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మచ్చ అనసూర్య, జెడ్పీటీసీ కోడెపాక సుమలత, ఎంపీడీవో రాజేంద్ర ప్రసాద్, ఏపీఓలు విద్యావతి, ఎంపీఓ అఫ్జల్, వివిధ గ్రామపంచాయతీల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించాలి



ప్రొసీడింగ్ కాపీని అందజేస్తున్న ఎమ్మెల్యే

ఐనవోలు: తమ గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు అధిక నిధులు కేటాయించాలని మండలంలోని లింగమోరిగూడెం గ్రామస్తులు శుక్రవారం ఎమ్మెల్యే అరూరి రమేష్‌ను కోరారు. హన్మకొండలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలో జరగాల్సిన అభివృద్ధితో పాటు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. చిన్న గ్రామం కావడంతో ప్రభుత్వ నుంచి జీపీకి వచ్చే నిధులు సరిపోవడం లేదన్నారు. ప్రత్యేక శ్రద్ధ వహించి సీడీఎఫ్ నిధులు కేటాయించాలని కోరారు. ప్రభుత్వం పేదలుకు అందించే డబుల్ బెడ్రూం ఇళ్లు, దళితబంధు పథకంలో గ్రామానికి ఎక్కువ శాతం యూనిట్‌లు కేటాయించాలని కోరారు. త్వరలో గ్రామంలో పర్యటించి ఇప్పటికే పూర్తి అయిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించి, నూతన పనులకు శంఖుస్థాపన చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. అదే విధంగా గ్రామంలో నిర్మించబోయే నూతన జీపీ భవన నిర్మాణానికి సంబంధించిన ప్రొసిడింగ్ కాపీని ఎమ్మెల్యే గ్రామస్తులకు అందించారు. బుర్ర రాజ్‌కుమార్, బర్ల ఆనందం, దామెర యాకయ్య, రాజారపు ఎల్లయ్య, బర్ల సోములు, ఎలమకంటి మధు, నరసింహరాములు ఉన్నారు.

బోదకాలు వ్యాధి గ్రస్తులకు కిట్ల పంపిణీ

ఐనవోలు: మండలంలోని సింగారం గ్రామంలో బోదకాలు వ్యాధితో బాధపడుతున్న వారికి పల్లె దవాఖాన డాక్టర్ సరిత శుక్రవారం కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనారోగ్య నిర్వహణ, వైకల్యం నివారణ పథకంలో భాగంగా గ్రేడ్ 3 బోదకాల వ్యాధి గ్రస్తులైన 10 మందికి బోదకాల నిర్వహణకు సంబంధించిన కిట్లు అందించామన్నారు. ప్రతీ గ్రామంలో బోధకాల గ్రేడ్ 3 వ్యాధి గ్రస్తులను గుర్తించి కిట్ల పంపిణీ చేస్తామన్నారు. ఈ కిట్‌లో టబ్, మగ్గు, సబ్బు, టవల్, ఆయింట్‌మెంట్ 5 రకాల వస్తువులు ఉంటాయన్నారు. వీటిని ఎలా వినియోగించాలి, పుండ్లు కాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈలో రాజేంద్ర ప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ సతీష్‌చారి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.